## పాఠశాలలకు నోటు బుక్కుల పంపిణీ



పరిగి, జూన్ 10: అన్ని ప్రభుత్వ పాఠశాలలకు నోటు బుక్కులను పంపిణీ చేయనున్నట్లు పరిగి మండల విద్యాధికారి ఎం.గోపాల్ తెలిపారు. మంగళవారం పరిగి మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రతి విద్యార్థికి కూడా నోటు బుక్కులను పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్ లు, కేజీబీవీ పాఠశాలల్లో చదువుతున్న 5,673 మంది విద్యార్థులకు 41,537 నోటు బుక్కులను ఇవ్వడం జరిగిందన్నారు. పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నోటుబుక్కులను అందిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

## సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



వికారాబాద్, జూన్ 10: వంద రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం తొమ్మిదో రోజు వికారాబాద్ పట్టణం లో గల వ్యాపార సముదాయాల వారికి వాణిజ్య పన్ను చెల్లింపు, సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పై మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించారు. ఓపెన్ నాలా లో ఉన్న మురుగును తొలగించారు. పట్టణంలో ని ఫంక్షన్ హాల్ యజమానులకు తడి, పొడి చెత్త పై అవగాహన కల్పించారు. గెరిగేట్ పల్లిలో కుక్క కాటు వలన కలిగే సమస్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమం లో పురపాలక సంఘం కమీషనర్ జాకీర్ అహ్మద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాస్, ఎన్విరాల్మెంటల్ ఇంజనీర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



కులకచర్ల, జూన్ 10 : వాహనాలు నడిపేవారు తమ వాహనాలకు సంబంధించిన పత్రాలను తప్పని సరిగా దగ్గర పెట్టుకోవాలని కులకచర్ల ఎస్ఐ రమేశ్ తెలిపారు. మంగళవారం కులకచర్ల మండల కేంద్రంలోని పోలీస్టేషన్ దగ్గర మోటర్ సైకిల్ వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పని సరిగా పాటించాలని సూచించారు. వాహనానికి సంబంధించిన పత్రాలను తమ దగ్గర పెట్టుకోవాలని సూచించారు. వాహనం పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహణ కల్పించారు.

## దళిత నాయకుల అరెస్ట్‌పై ఆందోళన



బొంరాస్‌పేట, జూన్ 10 : దళిత నాయకుల అరెస్టుపై దుద్యాల మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బస్సు చంద్రయ్య నిరసన తెలిపారు. దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తాండూరు డీఎస్పీ కార్యాలయ ఆవరణలో ధర్నా చేస్తున్న జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ బాధితుడు నవీన్ తో పాటు కొంతమందిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. తాండూర్ మండలం బెల్కటూర్ గ్రామంలో దళిత యువకుడి పెండ్లి ఊరేగింపును అడ్డుకొని కులం పేరుతో దూషించారు.వారిని అరెస్టు చేయాలని తాండూరు డీఎస్పీ కార్యాలయ ముందు ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. తాండూరు డీఎప్పీ రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి అగ్రకుల పెత్తందారులను అరెస్టు చేయకుండా అగ్రకుల పెత్తందారులకు కొమ్ముకాస్తున్నారని అన్నారు.డీఎప్పీ పై చర్య తీసుకొని వెంటనే సస్పెండ్ చేసి దళితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.తెలంగాణ శాసనసభ స్పీకర్ సొంత గ్రామంలో దళితులకు ఆలయ ప్రవేశం లేకపోవడం దళితులు పెళ్లి చేసుకొని బారత్ నిర్వహిస్తున్న సమయంలో అగ్రకులస్తులు అడ్డుకోవడం చాలా దుర్మార్గమని అన్నారు.జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీకి ఆదేశాలు జారీ చేసి నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటేశ్,రాములు, సాయికుమార్, బుగ్గప్ప,అంబేద్కర్ సంఘాల నాయకులు ఆనంద్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వినూత్నంగా బడిబాట..



కొడంగల్‌లో పప్పెట్ షో ద్వారా అవగాహన

కొడంగల్, జూన్10: బడిబాట కార్యక్రమంలో భాగంగా పట్టణ పరిధిలో వినూత్నంగా పప్పెట్ షో ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు తిరుమలేశ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాగిజావా వంటి సౌకర్యాలతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దుస్తులు నోట్ బుక్స్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. విశాలమైన తరగతి గదులు, క్రీడ మైదానాలతోపాటు క్రీడా వస్తువులు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌తో పాటు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**బంట్వారం:** ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ విద్య ప్రారంభమైందని కోట్‌పల్లి మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు మోత్కుపల్లి గ్రామాల పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిపుణులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలోనే ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో డ్యానియల్, ఎంఈవో చంద్రప్ప, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

**దోమ:** మండల పరిధిలోని దిర్సంపల్లి గ్రామంలో కొనసాగుతున్న బడిబాట కార్యక్రమంలో ఏపీజే అబ్దుల్ కలాం యువజన సంఘం సభ్యులు పాల్గొని పిల్లల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కల్పించారు . ఈ సందర్భంగా మండల విద్యాధికారి వెంకట్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులలో వసతులు ఉన్నాయని ఈ అవకాశాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కేశవులు, గోపాల్, సతీష్ యువజన సంఘం అధ్యక్షుడు మహమ్మద్ ఇమ్రాన్,ప్రధానకార్యదర్శి సోహెల్, సంఘం సభ్యులు ఆరీఫ్ తాహెర్,హుస్సేన్ మోయిజ్,కాజిమ్ సల్మాన్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

**నవాబుపేట:** బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు విస్తృతంగా ప్రచారం చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. మంగళవారం లింగంపల్లి గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో తహసీల్దార్ బుచ్చయ్య పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, అక్కడ బోధించే ఉపాధ్యాయుల అర్హతపై విద్యార్థుల తల్లిదండ్రులకు తహసీల్దార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో వెంట రెవిన్యూ సిబ్బంది, ప్రభుత్వ ఉపాధ్యాయులు, గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

**బొంరాస్‌పేట :** దుద్యాల మండల పరిధిలోని జీడిగడ్డ తాండ,బొంరాస్ పేట మండల పరిధిలోని మద్దిమడుగు తండాలో మూడు గ్రూపులుగా ఉపాధ్యాయులు వారికి కేటాయించిన గ్రామాల్లో పర్యటించారు. బడీడు పిల్లల గుర్తింపు నమోదు ప్రక్రియను నిర్వహించారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను గురించి ఇంటింటికి తిరుగుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, అభయ్ కుమార్, రవి నాయక్, కాశయ్య, రమేశ్, మల్లయ్య పాల్గొన్నారు.

**ధారూరు:** ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని గడ్డమీది గంగారం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహులు తెలిపారు. మంగళవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గడ్డమీది గంగారం దగ్గరలో ఉన్న నర్సాపూర్ గ్రామంలో పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. తమ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు ఉన్నారు.

**కులకచర్ల:** ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించాలని కులకచర్ల ఎంఈవో అబీబ్‌హైమద్ అన్నారు. మంగళవారం కులకచర్ల మండల పరిధిలోని పుట్టపహాడ్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




దోమ: దిర్సంపల్లి బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న అబ్దుల్ కలాం యువజన సంఘం సభ్యులు

## రైతుల శ్రేయస్సు కోసమే రెవెన్యూ సదస్సులు



మర్పల్లి: కొట్లాపూర్ గ్రామ రెవిన్యూ సదస్సులో దరఖాస్తులు తీసుకుంటున్న తహసీల్దార్ పురుషోత్తం

వికారాబాద్, జూన్10: భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరిగిందని తహసీల్దార్ రవీందర్ తెలిపారు. మంగళవారం మోమిన్ పేట్ మండల పరిధిలోని గోవిందాపూర్ గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు.ఈ రెవెన్యూ సదస్సులో గ్రామంలోని ప్రజల నుంచి రెవెన్యూ సమస్యలతో కూడిన పత్రలను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ పరిధి లోని రైతుల నుంచి భూ సమస్యల పత్రాలను స్వీకరించామని చెప్పారు. రైతుల నుంచి మిస్సింగ్ సర్వే నంబర్స్, విరాసత్ తదితర సమస్యలతో కూడిన ఫిర్యాదులు వచ్చాయని వాటిని పరిష్కరిస్తామన్నారు. ప్రజల నుంచి ఎన్నో రోజులుగా పేరుకుపోయిన భూ సమస్యలు వచ్చాయని, వాటికి సాధ్యమైనంత త్వరగా పరిష్కార మార్గం చూపిస్తామని తెలిపారు. ప్రజలు రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు

**నవాబుపేట:** రైతుల భూమి సమస్యలను పరిష్కరించాలనే సదుద్దేశంతోనే రెవిన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని తహసీల్దార్ బుచ్చయ్య అన్నారు. మంగళవారం గంగ్యాడలో 12 మాదారంలో 25 మొత్తం 37 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. గంగ్యాడలో సర్వేకు సంబంధించిన దరఖాస్తులు ఆరు రాగా వాటిని అక్కడికక్కడే సర్వే యర్ తో మాట్లాడి పరిష్కరించినట్లు తెలిపారు. ప్రతి దరఖాస్తును కూడా రెవిన్యూ రికార్డు ప్రకారం పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శ్రీలత, ఆర్ ఐ రజిత, రాజు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**మర్పల్లి:** మండలంలోని కొట్లాపూర్, మల్లికార్జున గిరి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తహసీల్దార్ పురు షోత్తం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామా ల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని, రైతులకు సంబంధించి భూ సమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచిం చారు. కార్యక్రమంలో ఆర్ఐలు మాధవ రెడ్డి, వెంకటేశం, సిబ్బంది కనక రావు, శ్రీనివాస్, రవి కుమార్, శ్రీహరి, సాయిలు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు..

## మేకలు మేపుకుంటూ వెళ్లిన బాలిక మృతి

పెద్దేముల్, జూన్ 10 : గిర్మాపూర్ గ్రామ శివారులో మేకలు మేపుకుంటూ వెళ్లిన రాధిక, ప్రియాంక, వైష్ణవి అక్కడే పొలంలో ఉన్న ఒక రాయిపై ఆడుకుంటూ ప్రమాదవశాత్తు వైష్ణవి అనే అమ్మాయి గుంతలో పడి పోగా రాయి దొర్లుకుంటూ వచ్చి వైష్ణవి పై పడటంతో పక్కనే ఉన్న పిల్లలు కేకలు వేయడంతో గమనించిన గ్రామస్థులు జేసీబీ సాయంతో రాయిని తొలగించి వైష్ణవిని తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే వైష్ణవి మృతి చెందిందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనలో రాధిక అనే అమ్మాయికి గాయాలు కాగా, వైష్ణవిది ఉషా నాయక్ తండా, సంఘటనపై మృతి చెందిన బాలిక తల్లిదండ్రులు దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు

## ట్రాక్టర్ రివర్స్ పోటీలు

యాలాల జూన్ 10 : ఏరువాక పౌర్ణమి పురస్కరించుకొని తన తండ్రి కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ట్రాక్టర్ రివర్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పోటి నిర్వాహకులు పవన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు యాలాల మండలం చెన్నారం గ్రామంలో ఈ పోటీలను నిర్వహించనున్నామన్నారు. ట్రాక్టర్ ట్రాలీతో నిర్దేశం చిన ప్రదేశం వరకు రివర్స్ లో ఎవరైతే తక్కువ సమయంలో చేరుకుంటారో వారిని విజేతగా ప్రకటించడం జరుగుతుందన్నారు. గెలిచిన వారికి మొదటి, రెండవ బహు మతిగా క్యాష్ ప్రైస్‌ను అందించడం జరు గుతుందన్నారు.

## అనుమానంతో భార్యను చంపేశాడు..

చంపాపేట, జూన్ 10 : వివాహేతర సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో భార్యను చున్నీతో ఉరివేసి హత్య చేశాడు. ఈ సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది... పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్ర ప్రదేశ్ తూర్పుగోదావరి జిల్లా, కొమ్మనపల్లి గ్రామానికి చెందిన మరియ దాసుకు సరూర్‌నగర్ భాగ్యనగర్ కాలనీకి చెందిన తకాడ అమ్ములుతో 2013లో వివాహం జరిగింది. అప్పటినుంచి వారు లింగోజిగూడ డివిజన్, భాగ్యనగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు పాప మహి అశ్విని (11), బాబు(7) . కాగా.. కొంతకాలంగా భార్య పై అనుమానం పెంచుకోగా.. తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి దంపతులిద్దరూ మరోసారి గొడవ పడ్డారు. దీంతో మరియ దాసు ఆవేశంతో చున్నీతో భార్య అమ్ములు మెడకు ఉరేసి హత్య చేశాడు. మంగళవారం ఉదయం అమ్ములు తండ్రి అర్జున్‌కు సమాచారం అందజేసి అక్కడి నుంచి మరియదాసు పరా రయ్యాడు. వెంటనే వారు వచ్చి చూడగా కూతురు మృతి చెంది ఉన్నది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### పరారీలో నిందితుడు

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



కొడంగల్, జూన్ 10: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయాధికారి శంకర్ రాథోడ్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలో టాస్క్‌ఫోర్స్ బృందం సహాయ వ్యవసాయ సంచాలకులు శంకర్ రాథోడ్, ఎస్ఐ జీ వి సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారిణి తులసి ఆకస్మికంగా విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మినా, బిల్లులు లేకుండా ఎరువులు విత్తనాలు విక్రయించినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దుకాణదారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించొద్దని, విత్తనాలు ఎమ్మార్పీ ధరకు విక్రయించాలని, లైసెన్స్ లు లేకుండా ఎరువులు విత్తనాలు విక్రయిస్తే శాఖ పరమైన చర్యలకు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎరువులు విత్తనాలకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని సూచించారు. అదేవిధంగా స్టాక్ బోర్డ్ తప్పక పాటించాలని ధరలు, స్టాక్ వివరాలు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రాములు, కృష్ణ పాల్గొన్నారు.

## వ్యవసాయ యాప్‌పై రైతులకు అవగాహన



కొడంగల్, జూన్ 10: ఇక్రిశాట్ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో కృషివాస్ అనే యాప్ ద్వారా పంటలను గమనించడం వంటి వాటిపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని పర్సాపూర్ గ్రామ రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఏడిఏ శంకర్ రాథోడ్ మాట్లాడుతూ పంటల్లో నెలకొనే చీడపురుగును గుర్తించి వాటిని సకాలంలో నివారించుకునేందుకు చర్యలు చేపట్టుకుంటే పంట నష్టాలను ఎదు ర్కోవచ్చాన్నారు. శాటిలైట్ నుంచి రైతుల పంట పొలాల్లో వచ్చే చీడ పీడలని గుర్తించి సకా లంలో సస్య రక్షణ చర్యలను చేపట్టడం, వాటికి అనువైన పురుగు మందులను సూచించడం గురించి వ్యవసాయ అధికారి ఏడిఏ రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఇక్రిశాట్ శాస్త్రవేత్తల బృందం రామన్ గౌడ్, జగదీష్ తోపాటు జి మండల వ్యవసాయ అధికారులు తులసి, నాగరాజ్, పోలప్ప, ఎ ఈ ఓ లు తదితరులు పాల్గొన్నారు.

## అక్కను బాగా చూసుకోవడం లేదని బావపై దాడి

### అడ్డుగా వచ్చిన తల్లిని కొట్టడంతో మృతి, మరో వ్యక్తికి తీవ్ర గాయాలు

పరిగి, జూన్ 10 : అక్కను బాగా చూసుకోవడం లేదనే కారణంతో బావపై దాడికి పాల్పడగా అడ్డుగా వచ్చిన అతడి తల్లిని కొట్టడంతో మహిళ చనిపోగా, ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి పరిగి మండలం రాపోలు గ్రామంలో చోటు చేసుకుంది. రాపోల్ గ్రామానికి చెందిన గండు నర్సమ్మ, ఆమె కొడుకు గండు రాజేందర్ పై అదే గ్రామానికి చెందిన రాంచరణ్, కొందరు యువకులు దాడికి పాల్పడ్డారు. కొడుకు రాజేందర్ ను కొట్టవద్దంటూ తల్లి నర్సమ్మ అడ్డుకునే ప్రయత్నం చేయగా యువకులు నర్సమ్మ పై దాడి చేశారు. దీంతో నర్సమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. కొడుకు రాజేందర్‌కు తీవ్ర గాయాలు కావడంతో పరిగి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. రాపోల్ గ్రామానికి చెందిన సంగీత, అదే గ్రామానికి చెందిన రాజేందర్‌కు సుమారు పదేళ్ల క్రితం వివాహమైంది. గత మూడు సంవత్సరాలుగా భార్యాభర్తలు విడివిడిగా ఉంటున్నారు. దీంతో సంగీత చిన్నాన్న కుమారుడు రాంచరణ్ తన అక్కను బాగా చూసుకోవడం లేదనే కోపంతోనే ఈ దాడికి పాల్పడినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న పరిగి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన వారిలో అనుమానితులుగా ఉన్న వారిని పోలీసులు అదుపులోకి విచారిస్తున్నట్లు సమాచారం.

## భార్యాభర్తల మధ్య గొడవ..భర్త ఆత్మహత్య

బొంరాస్ పేట, జూన్ 10 : ఒక వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై అబ్దుల్ రాహుఫ్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన తొగపురం రవి, భార్య సునీతల మధ్య డబ్బుల విషయంలో గొడవ జరిగింది. సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయిన రవి సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు రాత్రి మొత్తం ఎదురు చూశారు. మంగళవారం ఉదయం బొంరాస్ పేట శివారులో గల పొలంలో ఉన్న చింత చెట్టుకు తాడుతో ఉరివేసుకొని కనిపించాడని గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతుడి అన్న తొగపురం శేఖర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

SHRIRAM Finance వాహనములు అమ్మబడును

| SNo. | VEHICLE NO. | DISCRIPTION | MODEL |
|---|---|---|---|
| 1. | TS07JN-9675 | CIAZ 1.4L DELTA PETROL 5 SEATER | 2018 |
| 2. | TS07HZ-3761 | BALENO DELTA BS6 PETROL 5 SEATER | 2021 |
| 3. | TS07UN3460 | MARUTI DZIRE BS6 PETROL-P | 2023 |
| 4. | TS10UB-5072 | HYUNDAI XCENT PRIME T+ DIESEL-P | 2018 |
| 5. | TS13UA-6333 | TOYOTA ETIOS DIESEL-P | 2016 |

పై వాహనాలు అమ్మబడును.
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
2nd Floor, D.No.15-38, Hanuman Complex,
Shadnagar - 509216, Telangana. Tel:08548 - 250100

# జంటహత్యల కేసులో వీడిన మిస్టరీ..

### ఉద్యోగం తీసేశారన్న పగతోనే వృద్ధ దంపతుల హత్య

### మాజీ డ్రైవర్‌తోపాటు మరొకరు అరెస్ట్

బండ్లగూడ, జూన్ 10 : రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుద్వేల్ జనచైతన్య కాలనీలో గురువారం జరిగిన జంట హత్యల కేసులో మిస్టరీ వీడింది. తనను ఉద్యోగంలో నుంచి తొలగించారన్న కక్షతోనే మాజీ డ్రైవర్.. వృద్ధ దంపతులను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడు మహమ్మద్ షకీల్ సల్మాన్‌తో పాటు అతనితో వచ్చిన మహమ్మద్ ముజీవుద్దీన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. ఈనెల 5న జనచైతన్య కాలనీలోని ఆర్బిస్ రెసిడెన్సీలోని ఫ్లాట్-502లో నివసిస్తున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ జనరల్ మేనేజర్ షేక్ అబ్దుల్లా(70), ఆయన భార్య మాజీ లెక్చరర్ రిజ్వానా(65)లు హత్యకు గురైన విషయం తెలిసిందే. గతంలో రెడ్‌హిల్స్‌లో నివాసమున్నవారు ఇటీవల బుద్వేల్ జనచైతన్య కాలనీలో ఫ్లాట్ కొనుగోలుచేసి అందులోనే ఉంటున్నారు. గతంలో వారివద్ద మహమ్మద్ షకీల్ సల్మాన్ డ్రైవర్‌గా పని చేసేవాడు. అయితే అతని ప్రవర్తన నచ్చకపోవడంతో అతడిని 8 నెలల క్రితం ఉద్యోగంలో నుంచి తీసేశారు. అప్పటి నుంచి ఉపాధి దొరకక జులాయిగా తిరుగుతున్నాడు. తనను ఉద్యోగంలో నుంచి తీసేశారనే కోపంతో వారిపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో తన స్నేహితుడు మహమ్మద్ ముజీబుద్దీన్ దగ్గర సల్మాన్ రూ.40వేలు తీసుకున్నారు. డబ్బులు ఇస్తానని ముజీబుద్దీన్‌ను తీసుకుని ఈ నెల 4న రెడ్‌హిల్స్‌కు వెళ్లగా.. షేక్ అబ్దుల్లా బుద్వేల్‌కు షిఫ్ట్ అయ్యారని తెలిసింది. వెంటనే జనచైతన్య కాలనీకి వచ్చి షేక్ అబ్దుల్లా ఇంటిని చూసి లోనికి ఎలా వెళ్లాలని రెక్కీ నిర్వహించారు. ఈనెల 5న సాయంత్రం 5 గంటల సమయంలో షకీల్ సల్మాన్ బుర్ఖా ధరించి, ముజీబుద్దీన్ మాస్క్ ధరించి వాచ్‌మన్ రాజేశ్ వద్దకు వెళ్లి పొలం వద్ద నుంచి అలీ వచ్చారని షేక్ అబ్దుల్లాకు సమాచారం ఇచ్చారు. షేక్ అబ్దుల్లా క్లియరెన్స్ ఇవ్వడంతో వారిద్దరు లోనికి వెళ్లారు. సల్మాన్ తనవెంట తెచ్చుకున్న కత్తితో షేక్ అబ్దుల్లాను పొడిచాడు. ఈ హఠాత్తు పరిణామాన్ని చూసిన ముజీబుద్దీన్ అక్కడి నుంచి బయటకు పరుగులు తీశారు. అడ్డు వచ్చిన భార్య రిజ్వానాను కూడా కత్తితో దారుణంగా పొడిచి చంపాడు. నిందితుడు సల్మాన్ కొద్దిసేపు అక్కడే ఉండి మృతుడి జేబులో నుంచి రూ.600 తీసుకొని పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి.. ప్రధాన నిందితుడు సన్మాన్‌తోపాటు అతడితో వచ్చిన ముజీబుద్దీన్‌ను అరెస్ట్ చేశారు. సమావేశంలో ఏసీపీ తులా శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు క్యాస్ట్రో, ప్రశాంత్, సీసీఎస్, ఎస్‌ఓటీ పోలీసులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ శ్రీనివాస్

### అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండండి

అపార్టుమెంట్లలో నివాసం ఉండేవారు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి ఒక్కరు ఇంటి ముందు సీసీ కెమెరాలు అమర్చుకొని .. వ్యక్తులను పరిశీలించిన తర్వాతనే లోపలికి అనుమతించాలని సూచించారు. గేటెడ్ కమ్యూనిటీల్లో సెక్యూరిటీ సిబ్బందిని తగినంతగా నియమించి.. తనిఖీ చేసిన అనంతరం లోపలికి పంపించాలన్నారు.

